


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### బాలింత భోగం

**మా పెద్దవాడు** పుట్టగానే ఆ వార్త ఆయా వెళ్ళి బయట చెప్పడం ఆలశ్యం, అక్కడేవున్న పెద్దమ్మగారు కేలండర్ చూసి 'అశ్వనీ నక్షత్రం' వీడికి అశ్వనీ కుమార్ అని పెడ్దాం అందట. కన్న తల్లికి తొమ్మిది నెలలు మోసిన నాకు ఒక్క ఛాన్స్ కూడా ఇవ్వలేదు. ఇచ్చుంటే అమితాబ్‌బచ్చన్ పేరు కలిసేట్టు పెట్టేదాన్నామో? అసలు మా ఇంటర్మీడియెట్‌లో అమితాబ్ 'దో ఔర్ దో పాంచ్' చూసి, అమితాబ్‌ని అనుకరిస్తూ హింది మాట్లాడేవాళ్ళం.

అమ్మమ్మ "స్నానంచేస్తావా?" అంటే "అపున్ అభీ నహీ నహాయింగే" అంటే, ఆవిడ "ఏవిటా అపున్.. నహాయింగే? మై అను" అనేది. ఈ అమ్మమ్మతో మహా డేంజర్. అసలు హిందీ పండిట్‌కి హిందీ, ఇంగ్లీష్ సార్‌కి ఇంగ్లీషు ప్రైవేట్ చెప్పేసేది. మా తాతయ్య ఈవిడ్ని దుర్గాబాయి దేశ్‌ముఖ్‌తో బాటు పెట్టి మరీ హాస్టల్లో హిందీ, ఇంగ్లీషూ, స్కూల్‌ఫైనల్‌తోబాటు చదివించేసాడు.

నాకు ఓ ప్రొడ్యూసర్ "మా ఆవిడ విశారద పాసయింది. ఘూర్కాతో హింది మాట్లాడగలదు" అంటే తెగ నవ్వొచ్చింది. అసలు హిందీ, ఉర్దూలు మా హైదరాబాద్‌లో పుట్టి పెరిగిన మాలాంటి వాళ్ళందరికీ వస్తాయి. అలా అని చెప్పలేం. ఎందుకంటే అందరికీ చిన్నప్పటినుండీ సందానీలాంటి ఫ్రెండ్స్ ఉండరుగా. అలాగే బోనీ జేమ్స్ అనే ఫ్రెండ్ ఉండేది హైస్కూల్లో. ఓసారి అదీ నేనూ స్కూల్ నుండి వస్తుంటే, ఒకడు బాగా తాగి, తూలుతూ ఎదురొచ్చి దాని చెయ్యిపట్టుకుని "రావే.. నిన్ను పెళ్ళి చేసుకుంటా" అన్నాడు. మజ్జిగన్నంలో మాగాయ ముక్క నంచుకునే సగటు ఆడపిల్ల ఎవరైనా, నాలా అమ్మమ్మ చాటున పెరిగేది ఎవరైనా ఏం చేస్తారు? "బే" అని ఏడ్చి పరుగులు పెడ్తారు. ఔనా! కానీ మాబోనీ మాత్రం వాడ్ని పురుగుని చూసినట్లు చూసి "సాల్జెయ్‌రా సక్కదనాల్.. యిడు..యిడుసెయ్యి" అంది. వాడు పెద్దగా నవ్వుతూ దాని బుగ్గ గిల్లాడు. అంతే మరుక్షణం "సా..." ఇంకో అక్షరం గాల్లో కలిసిపోయేట్లు ఇది అరిచి చెయ్యి విదిలించుకుని కాలి చెప్పు తీసి వాడ్ని చెంపలు వాయించడమే కాకుండా తన తల వాడి కడుపులో పెట్టి, నెట్టుకుంటూ వెళ్ళి ఎలక్ట్రిక్ పోల్‌కి వాడ్నేసి కొట్టింది.

తాగిందంతా దిగిపోయి "బహెన్... మాఫ్‌కరో" అని వాడు చేతులు జోడించాడు. ఇది మూతి కొద్దిగా వంకరగా పెట్టి, ముంజేత్తో ముక్కూ మూతీ తుడుచుకుని రొప్పుతూ, అచ్చు అమితాబ్‌లా నిలబడి, ఆ తర్వాత నడుం మీద ఎడమ చెయ్యి పెట్టుకుని కాస్త ఒంగి

వాడితో "ఇంకోసారి గిన్నా ఏ పిల్లకెల్లైన్నా చూషినవా గుడ్లు పీకి గోటీలాడ్తా బిడ్డా" అంది. తర్వాత నా చెయ్యి పట్టుకుని "చేపలు తినాల.. అమ్మమ్మ పెట్టే చారన్నం, మజ్జిగన్నం కాదు. పద పోదాం" అంది.

నేను ఇంటికెళ్ళి, అచ్చు అమితాబ్‌లా అది ఎలా ఫైట్ చేసిందో ఇంట్లో అందరికీ చెప్పగానే మా అమ్మమ్మగారు "అమితాబ్ లేదూ, అమితం బుచ్చయ్యా లేడు. ఇంక దానితో కలిసి తిరగకు" అంది.

"ఏం? రౌడీలని ఎదిరించలేక, వాడు గిల్లితే గిల్లించుకునే నాలా మజ్జిగన్నం తినే మంజూ, బుజ్జీతో తిరగాలా?" అని అరిచాననుకున్నాను. కానీ అమ్మమ్మని చూస్తే గాలే తప్ప మాట బయటకొచ్చేది కాదు. అసలు బోనీ ధైర్యసాహసాలన్నీ అమితాబ్ బచ్చన్ సినిమాలు చూడడం వల్లే అని నా గట్టి నమ్మకం. అసలలా పెరిగి పెరిగి ఆ అభిమానం, మొన్న ఆయన 'దాదాసాహెబ్ ఫాల్కే' అవార్డు తీసుకుంటున్నప్పుడు నేను రాష్ట్రపతి భవన్‌లో ఎదురుగా కూర్చుని చప్పట్లు కొట్టడమే కాకుండా , 'హై టీ' రాష్ట్రపతి, అమితాబ్‌తోబాటు తీసుకునేటప్పుడు జయాబచ్చన్ కాస్త పక్కకి తొలగగానే వెళ్ళి పలకరించి నా పేరూ, నేను తెలుగు రైటర్‌ని అనీ చెప్పుకుంటుంటే, మేజర్ రవి అనే నా సహ నేషనల్ ఫిల్మ్స్ జ్యూరీ మెంబర్, ఇతనే శివరాజన్, నళినీలని రాజీవ్ గాంధీ హత్యకేసులో పట్టుకున్నది. "హీ ఈజ్ యువర్ ఫ్యాన్ సర్ ఫ్రం సిక్స్త్ క్లాస్.. హాత్ మిలాయియే ప్లీజ్" అని నా చేతిని చొరవగా ఆయన చేతిలో పెట్టడం... అమితాబ్ జీ చేతిలోకి నా చెయ్యి వెళ్ళిపోవడం అంతా అద్భుతంగా జరిగిపోయాయి. ట్రాన్స్‌లో వున్నదానిలా చూసా. ఆయన నా కళ్ళలోకి చూస్తూ నవ్వుతున్నారు. అమితాబ్ కళ్ళు అసలు ఎదురుగా వున్న వాళ్ళ మనసులోతుల్లోకి చూస్తూ నవ్వుతాయి.

అసలు మజ్జిగన్నంలో మాగాయ ముక్కవేసుకుని తిని, అమ్మమ్మ చాటున పెరిగి, ఎమ్.బీ హైస్కూల్ అనే, మాములు బడిలో అత్తెసరు మార్కులతో చదువుకుని, సందానీ, బోనీ జేమ్స్‌లాంటి ఫ్రెండ్స్ వున్న నేను. వాడు ఆటో డ్రైవర్ అయ్యాడు. అది గవర్నమెంట్ నర్స్ అయింది. అలాంటి నేను ఓ రోజున అమితాబ్ బచ్చన్‌ని కలుస్తాననీ, ఇలా నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్ జ్యూరీ మెంబర్‌గా కలుస్తాననీ అనుకున్నానా? వరలక్ష్మత్తయ్యగారు "దీన్ని ఎవడైనా సినిమా హాల్ గేట్ దగ్గర టికెట్ చించే వాడికిచ్చి పెళ్ళి చేసెయ్యండి, చదువబ్బడంలేదు. సినిమాల పిచ్చికూడానూ" అనేది. ఇప్పుడుంటే ఏం అనేదో? వాళ్ళ పిల్లలంతే మెరిట్‌లో ఎమ్.ఎస్సీలూ, ఎల్.ఎల్.బీలూ చదివారు. నాలా అమితాబ్‌తో రాష్ట్రపతి భవన్‌లో 'హై టీ' తీసుకోగలిగారా?

ఇదంతా అశ్విన్‌నీ వాడి లేత లేత పాదాలని నా బుగ్గలకి ఆన్చుకునేటప్పుడు నాకు తెలీదుగా! అప్పుడు ఫక్తు ఇల్లాలిని. మా అత్తగారికి, మా ఆయనెళ్ళి 'ఈ వార్త చెప్పగానే లడ్డూలు తెప్పించి, కాలనీలో అందరికీ పంచి పెట్టిందట. ఆ తర్వాత పిల్లాడ్ని చూసి "కోడలు నలుపైతే కులమెల్లా నలుపౌతుంది అని ఊరికే అన్నారా?" అని నవ్వారు. ఇప్పటికీ మా ఆయన్ని దెప్పుతూ ఉంటా. అలా అని నేను నలుపుకాదు. ఆయనా, మా అత్తగారు మరీ ముట్టుకుంటే మాసిపోయే రంగు. మరేం చేస్తాం? అలా సర్దుకుపోయాను. అంతేకానీ 'రేసిజమ్' అని కేసులవీ పెట్టలేకపోయా.

అది మొదలు మా అమ్మమ్మ కన్నాక నా నోటికో 'షీల్ లాక్' కొన్నుక్కొచ్చి వేసింది అనుకోండి. ఏం తినాలనిపించినా "కొత్తావకాయే? అమ్మో పిల్లాడికి వాతం" అని జాడీలోంచి పాత ఉప్పు పురిగిపోయిన ఆవపిండి, ఎండిపోయిన మావిడికాయ ముక్కా వేసేది ఇంక నా పాలిట విలన్ అనసూయా వాళ్ళమ్మ "మూడేళ్ళనాటి చింతకాయ పచ్చడి ఇదిగో వదినా" అంటూ, మా ఇంటి ముందు డాంబర్ రోడ్ వేసేటప్పుడు కొద్దిగ డాంబర్ ఎత్తుకొచ్చిందా అన్నట్లు కనిపించే ముద్ద నా కంచంలో వేసేది. వీళ్ళు తొమ్మిది మందిని ఎట్లా కన్నారో ఈ తిండితిని అనుకుందామన్నా లేదు. మూడు రోజులు ఆస్పత్రిలో రాత్రిళ్ళు మాడ్చినా, ఇంటికొచ్చాక, అమ్మమ్మ ఎవర్నీ ఆ పక్కకి రానివ్వద్దని మా శ్యామలమ్మకి చెప్పి, వేడి వేడి అన్నంలో పిండితే గిన్నెడు నెయ్యి కారేట్లు నెయ్యి వేసి, శొంఠి పొడీ, వెల్లుల్లి కారంపొడీ, తెలకపిండీ, బీరకాయకూరా, పాలతో అన్నం పెట్టేదా ఆహా! ఆ రుచి ఇప్పుడు గుర్తుచేసుకున్నా నోట్లో నీళ్ళు వస్తాయి.

ఇంక నా గదిలోకి గానీ నా మంచం దగ్గరకి గానీ ఎవరూ ఎలౌడ్ కాదు. పోలీస్‌లా కాపలా ఉండేది. బట్టలిప్పి పసివాడ్ని ఇస్తే, శ్యామలమ్మ నీళ్ళు పోసేది. ఓ రాత్రివేళ పిల్లాడు పక్కలో కనిపించలేదు. "అయ్యో నా పిల్లాడ్ని ఎవరో ఎత్తుకుపోయారని" నేను శోకాలు. చూస్తే మంచం కింద పాత బట్టలు పెట్టే ఖాళీ సుమిత్ మిక్సీ డబ్బాలో పడి ఆడ్తున్నాడు.

మరీ "అంత మొద్దు నిద్రేమిటే?" అని మా అమ్మమ్మ నాకు ప్రైవేట్ చెప్పేసింది.

ఇంక పదకొండోనాడు స్నానం నాడు, వీళ్ళ దుంపలు తెగా అనిపించేట్టు, అందరూ వేడి వేడి నీళ్ళ స్టీలు బిందెలు, ఇంత పసుపు బిందెకి పెట్టి పంపిస్తూనే ఉన్నారు. అవన్నీ సొక్కి సోలిపోయేదాకా నాకు పోసారు. నేను నెప్పులొచ్చి భరతనాట్యం, కథాకళీ చేస్తున్నప్పుడు, నా వెన్నుమీద వేడినీళ్ళు పోస్తాం అని నా వెనుక ఇంటిల్లిపాదీ ఎందుకు తిరిగారంటే, ఇదిగో ఇలా పదకొండో నాటిదాక, నా తలా ఒళ్ళూ తడిసే ఛాన్స్ ఉండదు కాబట్టిట. ఎంత ముందు చూపో.

వాడు తుమ్మితే, నాకు అన్నంలో మజ్జిగ 'కట్' అయ్యేది. వాడు మరో మారు బయలుకి వెళ్తే "ఏం తిన్నావ్ చెప్పు?" అనేది పోలీస్‌లా అమ్మమ్మ. అలా వాడికి జడుస్తూ తినేదాన్ని. మిరపకాయ బజ్జీలూ లేవు, ఐస్‌క్రీమ్‌లూ లేవు అన్నమాట.

ఇంక పిల్లవాడికి మా శ్యామలమ్మా, శారదత్తయ్యా నలుగులు పెట్టి, నూనెతో మర్దనా చేస్తూ ఆ లేత చేతులూ, కాళ్ళూ అటూ ఇటూ లాగుతూ నీళ్ళు పోస్తుంటే, వాడు ఆ వేడినీళ్ళకి గుక్కపట్టి ఏడుస్తుంటే, నేను జటాయు పక్షిలా "ఇంక చాలు.. ఇంక చాలు" అని అల్లల్లాడేదాన్ని. కానీ ఆ స్నానం తర్వాత, సాంబ్రాణి పొగవేసి కుంపట్లో, ఒంటికి జాన్సన్ పౌడర్ వేసి చాదు బొట్టు పెట్టి పడుకో పెడితే, హాయిగా వాడు మూడుగంటలు పడుకునేవాడు.

ఉండండి ఈ "టాడ్లర్స్" బుక్ లో ఎంతసేపు పడుకుంటారో ఏం రాసారో చూద్దాం. 20 మినిట్సుట. హూ! ఒళ్ళు లోషన్‌తో రుద్ది, టబ్‌లో ముంచి తీస్తే ఇరవై నిమిషాలు కాక ఒళ్ళు అలసి ఎక్కువసేపు ఎలా పడుకుంటారూ? 'పెద్దవాళ్ళ మాట పెరుగన్నం మూట' అని ఊరికే అనలేదు.

బాలింతలం, చక్కగా నవారు మంచం మీద పడుకుని, మంచం కింద బొగ్గుల కుంపట్లో సాంబ్రాణి పొగవేస్తూంటే, హాయిగా ఏ మల్లెపందిరి కిందో మంచం వేసుకుని, మేఘాల్లో తేలిపోతూ ఎంత హాయిగా పడుకునే వాళ్ళం. కడుపునిండా పురిషెడు నెయ్యి వేసి అన్నం పెట్టి, నిద్రపోకుండా కాపలా కూర్చునేది మా అమ్మమ్మ. మా విలన్ అనసూయా వాళ్ళమ్మ కూడా అక్కడే కూర్చునేది అమ్మమ్మకి సాయం. కంటిమీదకి నిద్రవస్తూ వుంటే వీళ్ళు కబుర్లతో డిస్టర్బ్ చేసేవాళ్ళు. బాలింతలు అంటే నడికట్టూ, నోట్లో తాంబూలం, చెవిలో దూది, నెత్తిమీద చెంగూ, కాలికి చెప్పూ. ఏదీ ఆ కళ?


ఆస్పత్రిలోనే సాంబార్, అన్ని కూరలూ వేసి భోజనం పెట్టేస్తారు. కన్న మూడుగంటలకి వీళ్ళు లేచి బాత్‌రూంకి వెళ్ళి షవర్ స్నానం చేసేస్తారు. ఇంటికొచ్చాక వీళ్ళు మామూలుగా పనీపాటలు చేసేసుకుంటున్నారు. మాలా వీళ్ళకి అబ్బురాలా? భోగాలా? ఎంతో జాలేస్తుంది. అసలు లక్కలా పండిన తాంబూలం నోరూ, కర్పూరాలతో చేసిన నలుగుపిండి వాసనా, సాంబ్రాణి ధూపం పొగలూ ఏవండీ? ఆ శోభ ఇప్పుడుందా? 'బీరపూలు పూసేవేళ.. పసిపాపలేడ్చేవేళ' అని పాట ఉంది. సాయంత్రాలు దీపాలు పెట్టకముందే అన్నం పెట్టేసేవారు. బోలెడు మంది పసివాడ్ని ఎత్తుకు తిరగడానికి ఉండేవారు. బేబీస్ అని పార్ట్ 1, పార్ట్ 2 అమెజాన్ ప్రైమ్‌లో 'వెబ్ సిరీస్' కూడా వస్తున్నాయట.


ఈ వాట్సప్ తల్లుల గ్రూప్ అది ఫాలో అవుతున్నారు. ఆయింట్ మెంట్ ట్యూబ్ అయిపోతుందేమోనని గాయం చేసుకుని పూసేసుకున్నాడుట ఒకడు. అలా ఈ కాలం పుస్తకంలో రాసినట్లు వీళ్ళు చేస్తున్నారా లేదా అని చూస్తారు. నేనైతే ఆ పుస్తకంలో నా పిల్లలు చేసినట్టు రాసారా లేదా? అని చూస్తాను. పిల్లాడు నోట్లో వేలెట్టుకున్నాడు. కళ్ళు నులుపుకున్నాడు. పుస్తకంలో ఏం రాసారో చూస్తారు. అలా ఉందిప్పుడు.

నేను కన్న పదోనాడు కానీ లక్ష్మణరావు రాలేకపోయాడు తునినుండి. ఓ గంప తమలపాకులతో వచ్చాడు. అత్తయ్య తమ్ముడే అయినా, మా అమ్మ ఆర్.టీ.సీలో ఉద్యోగం వేయించడం వలన స్వంత తమ్ముడిలా ఉంటాడు అనడం కన్నా తల్లి తోడుగా ఉంటాడు. అంటే రైటేమో? కాళ్ళు కడుక్కుని నా గదిలోకొచ్చి "తల్లీ బిడ్డా క్షేమమే కదా. వాడికి నీ పాలే ఇస్తున్నావా? పోతపాలు పట్టకు" అన్నాడు. అప్పుడు నేను ఒక మగవ్యక్తి పాలగురించి మాట్లాడు ఏమిటీ? అని తెగ సిగ్గుపడ్డాను. ఆ తర్వాత మగాళ్ళు ఇలా మాట్లాడ్తారా అని లక్ష్మణరావు గురించి చెప్పుకుని నవ్వుకునే వాళ్ళమా. మా అక్క కూతురుకి రెండోసారి డెలవరీ ముందు నేను బోస్టన్ వెళ్ళాను. ఈ అమెరికా తెల్ల లక్ష్మణరావులు పిల్లల్ని చంకనేసుకొచ్చి "కాల్ మీ.. వెన్ యువర్ వాటర్ బ్రేక్స్" అనో... "యూ షుడ్ వాక్ ఆర్ ఎక్సర్ సైజ్ టిల్ నైన్త్ మంత్" అనో సలహాలిస్తూవుంటే, అదేం అసహజంగా ఫీల్ అవకుండా మా అక్క  కూతురు "థాంక్స్ మైక్ ఐవిల్ లెట్ యూనో" అనడం ఇంకా విచిత్రంగా అనిపించింది.

మా అత్తగారు మనవడికి నవ్వులకు నువ్వులుండలూ, బోర్లాపడితే బొబ్బట్లూ, గడపదాటితే గారెలూ, పలుకులకి చిలకలూ, అడుగులేస్తే అరిసెలూ అన్నీ ముచ్చటగా చేసారు. నిజంగా పెద్దవాళ్ళు చేసే ముచ్చట్లూ, మందలింపులూ ఇప్పుడు దొరకమన్నా దొరకవు కదా! అప్పుడప్పుడు బాలింతలు తినే కాయంలా, వాళ్ళు కోప్పడినా కమ్మటి వెన్న కాచిన నెయ్యిలాంటి ఆప్యాయతా కురిపించేవారు. బాలింతకి ఎంత భోగం. "మొదట భోజనం పెట్టండి. తాంబూలం ఇవ్వండి. అమ్మా నెత్తిన చెంగేసుకో. కాలికి చెప్పేసుకో నడికట్టేదే?" అంటూ ఆ గదమాయింపులో కనిపించని మంతానురాగాలు దాగుండేవి. ఇవన్నీ ఇప్పటివాళ్ళు డబ్బెట్టి కొనుక్కుంటున్నట్లు 'ఆయా'లనీ, హెల్పర్స్‌నీ పెట్టుకుంటున్నారు. మంచిదేకానీ "అమ్మా సెనగపిండి తినకు.. పిల్లాడికి కడుపు నెప్పొస్తుంది. అప్పుడే చింతపండు చారేసుకోకు పిల్లాడికి చెవిపోటొస్తుంది. పుట్టమన్ను తెచ్చా. వాడి చెవికి పెట్టు. చాటుగా పాలియ్యి, దిష్టి తగులుతుంది. బాలింత భోజనం చేస్తోంది. రెండాకళ్ళు! చూడకండర్రా. దిష్టి తగిలేను" అనే ప్రేమ పరాయి వాళ్ళకెందుకుంటుందీ?

Post your comments







https://www.youtube.com/watch?v=ERaaX_IulS4